నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 27 జనవరి 2025 | KHAMMAM

కాంగ్రెస్ గూండాగిరి

- పథకాల గురించి ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై దాడి
- అడ్డుకున్న జీసీసీ ఉద్యోగిపై విరుచుకుపడ్డ 'హస్తం' నేతలు
- దాడిలో తీవ్రంగా గాయపడిన తాత్కాలిక ఉద్యోగి కొడెం రవి
- క్షతగాత్రులతో కలిసి జీపీ ఎదుట బీఆర్ఎస్ నేతల ఆందోళన
- బెండాలపాడులో ఉద్రిక్తంగా పరిస్థితి.. చర్యలకు పోలీసుల హామీ
- తిరుమలాయపాలెంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు నిరసన సెగ
- తమకు ప్రభుత్వ పథకాలు ఎందుకు ఇవ్వడంలేదంటూ నిలదీత
- పథకాల మంజూరు పత్రాల పంపిణీలో నాలుగు చోట్ల రసాభాస
- మాజీ సీఎం కేసీఆర్‌పై వైరా ఎమ్మెల్యే రాందాస్ అనుచిత వ్యాఖ్యలు

బెండాలపాడు పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, గ్రామస్తులు

చండ్రుగొండ/ తిరుమలాయపాలెం/ కూసుమంచి/ మణుగూరు టౌన్/ వైరా టౌన్, జనవరి 26: నాలుగు పథకాల మంజూరు పత్రాల పంపిణీలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం నాలుగు చోట్ల రసాభాస జరిగింది. పథకాల గురించి ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నేతలు గూండాగిరీ ప్రదర్శించారు. సంక్షేమ పథకాలను అర్హులకెందుకు ఇవ్వలేదని అడిగిన బీఆర్ఎస్ చండ్రుగొండ నాయకులపై ఏకంగా దాడులకు పాల్పడ్డారు. అడ్డుకున్న జీసీసీ తాత్కాలిక ఉద్యోగినీ చితకబాదారు. దీంతో అతడు తీవ్రగాయాలయ్యాడు. ఇక తిరుమలాయపాలెం మండలంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు నిరసన వ్యక్తమైంది. తాము అర్హులమైనప్పటికీ పథకాల జాబితాలో తమ పేర్లను ఎందుకు చేర్చలేదంటూ మహిళలు, గ్రామస్తులు నిలదీశారు. కూసుమంచి మండలంలోని ధర్మతండాలోనూ అర్హుల జాబితాపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26నే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21 నుంచి 24 వరకూ గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను ప్రకటించింది. ఆ జాబితాలో అర్హుల పేర్లు లేకపోవడం, అనర్హుల పేర్లతో జాబితా నిండి ఉండడం, దీంతో పేదలు పెద్ద సంఖ్యలో వచ్చి ఆయా గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవడం వంటివి చోటుచేసుకున్నాయి. అయితే, గ్రామసభల్లో అర్జీలు ఎక్కువగా వచ్చినందున తుది జాబితాను సిద్ధం చేసి ఫిబ్రవరి మొదటి వారంలో పథకాలు పంపిణీ చేస్తామని, ఈ లోగా జాబితాలు సక్రమంగా ఉన్న వాటిల్లో మండలానికి ఒక గ్రామం చొప్పున పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసిన వాటిల్లో జనవరి 26నే సభలు పెట్టి లబ్ధిదారులకు పథకాల మంజూరు పత్రాలు అందజేస్తామని ప్రకటించింది. అందులో భాగంగానే ఉమ్మడి ఖమ్మంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో అర్హులకు పథకాలు ఎందుకు రాలేదని అడిగినందుకు చండ్రుగొండ బీఆర్ఎస్ నాయకులపై అధికార పార్టీ నేతలు దాడికి పాల్పడ్డారు. అర్హులమైన తమకు మంజూరు పత్రాలు ఎందుకు ఇవ్వడంలేదంటూ తిరుమలాయపాలెం మండల ప్రజలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీశారు. జాబితాలో మొత్తం అనర్హులే ఉన్నారంటూ కూసుమంచి మండలం ధర్మతండా వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

చండ్రుగొండలో బీఆర్ఎస్ నేతలపై దాడి

సంక్షేమ పథకాలు అర్హులకు రాలేదని అధికారులను అడుగుతున్న సమయంలో అదును చూసి బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలం బెండాలపాడు పంచాయతీలో ఆదివారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమక్షంలో పథకాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కానీ గ్రామంలో అర్హులైన చాలామంది పేర్లు పథకాల జాబితాలో లేవు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మేడా మోహన్‌రావు.. పథకాలు రాని కొందరితో కలిసి బెండాలపాడు పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లారు. అప్పటికే పంపిణీ కార్యక్రమం ముగిసి ఎమ్మెల్యే వెళ్లిపోయారు. కానీ అధికారులు అక్కడే ఉన్నారు. దీంతో మోహన్‌రావు.. ఎంపీడీవో అశోక్ దగ్గరకు వెళ్లి పథకాలు అర్హులందరికీ ఎందుకు వర్తింపజేయడంలేదని అడుతున్నారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఈసం నాగభూషణం, బొర్రా సురేశ్, పొట్ట రాములు.. బీఆర్ఎస్ నేత మేడా మోహన్‌రావుపై దాడికి దిగారు. ఆ సమయంలో అక్కడే ఉన్న జీసీసీ తాత్కాలిక ఉద్యోగి కొడెం రవి.. ఈ దాడిని అడ్డుకున్నాడు. దీంతో మరింత రెచ్చిపోయిన కాంగ్రెస్ నాయకులు.. మోహన్‌రావుపైనా, రవిపైనా తీవ్రంగా దాడి చేశారు. దీంతో కొడెం రవికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పంచాయతీ కార్యాలయం ఎదుట క్షతగాత్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్ఐ శివరామకృష్ణ అక్కడకు చేరుకొని దాడిలో గాయపడ్డ కొడెం రవిని ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ శ్రేణులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. కాగా, ఈ దాడిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. బాధితులను ఫోన్లలో పరామర్శించారు.

కేసీఆర్‌పై వైరా ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

గత ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామసభలో పథకాల మంజూరు పత్రాలను వైరా ఎమ్మెల్యే పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో 'మా గ్రామానికి ఇంతవరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు వంటి సంక్షేమ పథకాలేమీ అందడంలేదు' అంటూ సభలోని ఓ మహిళ.. ఎమ్మెల్యే రాందాస్‌ను నిలదీసింది. దీంతో ఎమ్మెల్యే దాటవేత సమాధానం చెబుతూ.. గత ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసహనం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడిన కొడెం రవి

తిరుమలాయపాలెంలో కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్న ఎలువారిగూడెం మహిళలు

తిరుమలాయపాలెంలో నిలదీతలు..

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెంలో అధికార పార్టీ నేతలను గ్రామస్తులు, మహిళలు నిలదీశారు. గ్రామంలో 13 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 18 మందికి రేషన్ కార్డులు, 22 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 208 మంది రైతులకు రైతుభరోసా మంజూరైనట్లు అధికారులు ప్రకటించారు. కానీ కొద్దిమందికి మాత్రమే మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాబితాలోని పేర్లన్నీ అనర్హులవేనని మహిళలు సభలో నిరసన తెలిపారు. అధికారులను, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. తాను 20 రోజులకంటే అధికంగానే ఉపాధి హామీ పని చేసినప్పటికీ తన పేరును ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఎందుకు చేర్చలేదంటూ పచ్చిపాల అలివేలు అనే మహిళ వేదిక వద్దకు దూసుకెళ్లి అధికారులను, కాంగ్రెస్ నేతలను నిలదీసింది. కోట రాంబాయి, వీరపొంగు ముత్తమ్మ తదితరులు కూడా అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అధికారులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు స్పందిస్తూ.. దశలవారీగా పథకాలు అందిస్తామంటూ చెప్పి సభ నుంచి వెళ్లిపోయారు.

కూసుమంచిలో అభ్యంతరాలు..

అర్హత లేనివారికి మంజూరు పత్రాలు అందిస్తున్నారంటూ కూసుమంచి మండలం ధర్మతండా వాసులు అన్నారు. గ్రామసభలో మంజూరు పత్రాల పంపిణీపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అర్హత లేనివారికి, సాగు భూములు ఉన్న పథకాలు ఎలా మంజూరు చేస్తారంటూ ప్రశ్నించారు. అర్హులను పక్కన బెట్టి అనర్హులకు పత్రాలు అందజేస్తున్నారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు కట్టడి చేశారు.

గుడిసెలు ఉన్నవాళ్లకు కూడా ఇందిరమ్మ ఇళ్లు రాలేదు..

'మా ఊళ్లో రేకుల ఇళ్లు, గుడిసెలు ఉన్నవాళ్లకు కూడా ఇందిరమ్మ ఇళ్లు రాలేదు. అసలైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు రాకపోవడం అన్యాయం. కొద్దిమందికే ఇళ్లు మంజూరు చేశారు. వారికే ఈ రోజు ఆ మంజూరు పత్రాలు అందించారు. అందులోనూ అనర్హులు ఉన్నారు. ఈ విషయం మాకు ముందే తెలిస్తే అనర్హులకు కాగితాలు ఇవ్వకుండా చేసేవాళ్లం. నాకు అర్హత ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇల్లు రాలేదు.'

–గుగులోత్ ఉపేందర్, ఏలువారిగూడెం, తిరుమలాయపాలెం

బీఆర్ఎస్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో జాతీయ జెండాను ఎగుర వేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, జనవరి 26: బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్ 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ముఖ్య అతిథిగా పాల్గొని ముప్పన్నెల పతాకాన్ని ఎగుర వేశారు. జిల్లా ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కేఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, అజ్మీరా వీరూనాయక్, మక్బుల్, తోట రామారావు, శీలంశెట్టి రమాదేవి వీరభశద్రం, దాదె అమృత, మాటేటి నాగేశ్వరరావు, బుర్రి వెంకట్, విజయలక్ష్మి, నాయకులు తాజుద్దీన్, ఉప్పల వెంకటరమణ, తాళ్లూరి జీవన్ కుమార్, ఇంటూరి శేఖర్, కొల్లు పద్మ, పగడాల నరేందర్, కాట్రాల శ్రీరాములు, ఈదుల రాజేశ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

జెండా ఎగురవేస్తున్న రేగా

కొత్తగూడెం అర్బన్, జనవరి 26: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. కొత్తగూడెంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలని తుంగలో తొక్కిందని, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నిలువునా ముంచిందని విమర్శించారు. ఏ వర్గం కూడా ఆనందంగా లేదని అన్నారు. బోగస్ హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేషన్‌కార్డుల పంపిణీ, డబుల్ బెడ్రూం, ఇళ్ల స్థలాలు వంటివి ఎన్నికల స్టంట్లు మాత్రమేనని, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ గ్రామసభల పేరుతో వస్తోందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకెళ్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కాపు కృష్ణ, మాజీ ఎంపీపీ బదావత్ శాంతి, హుస్సేన్, దూడల బుచ్చయ్య, సంకుబాపన అనుదీప్, రెంటపల్లి మాధవీలత పాల్గొన్నారు.

పేదలకూ రాజ్యాంగ ఫలాలు

త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

- అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం..
- ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తున్నాం..
- అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం..
- గణతంత్ర దిన వేడుకల్లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, జనవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజాస్వామ్య, సార్వభౌమ, సామ్యవాద, లౌకిక వ్యవస్థల పునాదులపై మన రాజ్యాంగం రూపుదిద్దుకున్నదని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. అందుకని దేశ ప్రజలకు, ముఖ్యంగా పేదలకు రాజ్యాంగ ఫలాలు అందిస్తూ దానికి సార్థకత చేకూరుస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వాలు చేపట్టిన ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో రిపబ్లిక్ డే (గణతంత్ర దినోత్సవం) వేడుకలు ఆదివారం కనుల పండువలా జరిగాయి. జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్వాతంత్ర్య సమరయోధుల సమక్షంలో జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా మన రాజ్యాంగ విశిష్టతను, దాని ఆవిర్భావ నేపథ్యాన్ని గుర్తుచేశారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఖమ్మం జిల్లాలో 42,461 మంది రైతుల నుంచి 24,41 లక్షల క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి వారికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ కూడా చెల్లించామన్నారు. పంటల సాగుపై రైతుల సందేహాలను నివృత్తి చేసి సలహాలు, సూచనలు చేసేందుకు గాను కలెక్టరేట్‌లో ప్రత్యేక కాల్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. రఘునాథపాలెంలో మంచుకొండ ఎత్తిపోతల పథకానికి రూ.66.33 కోట్లు మంజూరు చేశామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా జిల్లాలోని 592 పాఠశాలల్లో రూ.12 కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు వైద్యసేవలను అందించేందుకు పక్కా ప్రణాళికలను అమలు చేస్తున్నామన్నారు. సత్తుపల్లి, మధిర ఆసుప్రతులను 100 బెడ్లతో అప్‌గ్రేడ్ చేసి నూతన భవనాలను ప్రారంభించామని; వైరా, కూసుమంచిలో 100 బెడ్ల ఆసుపత్రుల నిర్మాణాలకు స్థలాలను సేకరించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 3,507 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు 17,500 ఇండ్లు మంజూరయ్యాయని, పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసేందుకు పనులు వేగవంతం చేశామని అన్నారు. 2,40,504 లక్షల మంది గ్యాస్ సబ్సిడీ లబ్ధిదారులకు రూ.21.31 కోట్లను జమ చేశామన్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా 2,57,995 పేద కుటుంబాలకు 200 యూనిట్ల చొప్పున విద్యుత్ అందిస్తున్నామన్నారు. భూ భారతి అమలులో భాగంగా 70 వేల దరఖాస్తులను పరిష్కరించామన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతున్నదని, ఖమ్మం నగరానికి రింగ్‌రోడ్డు ప్రతిపాదనల పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. టూరిజం అభివృద్ధిలో భాగంగా ఖమ్మం ఖిల్లాతోపాటు గుర్తించిన పలు ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు పటిష్ఠంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించారు. విద్యార్థుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మైదానంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మ్రిణాళ్ శ్రేష్ఠ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ పథకాలు అమలు నిరంతర ప్రక్రియ
- ఇందిరమ్మ క్యాంటీన్లతో మహిళలకు ఉపాధి
- ఈజీఎస్ పనులు చేసే వాళ్లకు ఆత్మీయ భరోసా
- గణతంత్ర వేడుకల్లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్
- హాజరైన ఎస్పీ రోహిత్‌రాజు, డీఎఫ్‌వో కృష్ణగౌడ్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో పతాకావిష్కరణ చేస్తున్న కలెక్టర్ జితేశ్ పాటిల్

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 26 (నమస్తే తెలంగాణ): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఆదివారం జరిగిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ రోహిత్‌రాజు కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ ప్రసంగించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన గ్రామసభల్లో మరికొందరు దరఖాస్తుదారుల నుంచి నుంచి నాలుగు పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించామని అన్నారు. వీరిలో అర్హులను ఎంపిక చేసి వారికి కూడా పథకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాల ఫలాలకు పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, గృహజ్యోతి పథకాలను పేదలకు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఇందిరా మహిళా క్యాంటీన్ల ద్వారా స్వయం సహాక సంఘాల మహిళలకు స్వయం ఉపాధిని అందిస్తున్నట్లు గుర్తుచేశారు. జిల్లాలోని చౌక దుకాణాల ద్వారా 8,38,399 మంది కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేసినట్లు చెప్పారు. వీరితోపాటు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీల విద్యార్థులకు కూడా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. పౌరసరఫరాలు, స్త్రీ, శిశు సంక్షేమ, విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పరిశ్రమలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా ఆయా వర్గాల ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని వివరించారు.

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు..

విధి నిర్వహణలో ఈ ఏడాది ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఉద్యోగులకు కలెక్టర్ జితేశ్, ఎస్పీ రోహిత్‌రాజు, డీఎఫ్‌వో కృష్ణగౌడ్ కలిసి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. భద్రాద్రి జిల్లాలో 88 విభాగాల నుంచి 420 మంది అధికారులు, ఉద్యోగులకు వీటిని అందజేశారు. గణతంత్ర వేడుకల సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చిన్నారులకు కూడా బహుమతులు ప్రదానం చేశారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాటుచేసిన స్టాళ్లను అతిథులు, జిల్లా ప్రజలు తిలకించారు. కాగా, ఈ వేడుకలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకాకపోవడంతో ప్రాంగణమంతా ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది.

గణతంత్ర వేడుకల్లో భాగంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న చిన్నారులు